

# ఖలీఫాగారికి రెండవ పాఠం

మరోసారి యిలాగే రాత్రివేళ నగర పర్యటన చేస్తున్నారు ఖలీఫాగారు.

బాగా ఊరవతల ఒక యింట్లో నుంచి పొగ వస్తోంది. ఇదేమిటి యింత రాత్రివేళ వంట చేసుకుంటున్నారు అని అక్కడకు వెళ్లి చూశారు. అక్కడొకామె వంట చేస్తోంది. ఆమె పిల్లలు ఆకలితో ఏడుస్తున్నారు. తల్లి త్వరగా వంట పూర్తి చేస్తే తిందామని చూస్తున్నారు. కానీ ఆ వంట ఎంతకీ పూర్తవలేదు. పిల్లలు ఏడుస్తూనే వున్నారు. ఆమె కూడా ఏడుస్తూనే వుంది.

ఖలీఫాగారు చూసి చూసి 'ఏమ్మా. ఏంటిది? నువ్వు వంట చేస్తున్నావా? వంట నటిస్తున్నావా? పిల్లలు ఆకలితో ఏడుస్తుంటే త్వరగా అన్నం పెట్టక ఏం చేస్తున్నావ్?' అని కోప్పడ్డారు.

'ఈ కోపం నా మీద కాదు వెళ్లి ఖలీఫా మీద చూపించండి' అందామె చురుగ్గా.

ఖలీఫాగారు కంగారు పడ్డారు.

'మధ్యలో ఆయనేం చేశారు?' అని అడిగారు.

'ఆయన చేయకపోతే మరెవరు చేస్తారు? నా భర్త చనిపోయాడు. నాకు వేరే ఆదరవు లేదు. నా పిల్లలను పోషించలేను. అందుకనే పొయ్యి మీద కొన్ని వేడినీళ్లు పడేశాను. పిల్లలు దానినే అన్నం అనుకొని చూసీ చూసీ నిద్రపోతారు. రోజూ నేను చేసే పనే యిది. భర్త చనిపోయిన ఆడవాళ్లు తన రాజ్యంలో ఎలా బతుకుతున్నారో తెలుసుకోవాల్సిన పని ఖలీఫాగారికి లేదా? వారి గురించి వారి పిల్లల గురించీ ఆయన ఎప్పుడైనా ఆలోచించారా?' అని అడిగిందామె.

ఖలీఫాగారికి దిక్కుతోచలేదు. కన్నీరు ఆగలేదు.

వెంటనే యింటికి వెళ్లి తిండి పదార్థాలన్నీ ఆమెకు తెచ్చిచ్చి ఆ మరుసటిరోజే ఆమెకు పింఛను మంజూరు చేశారు. అంతేకాదు భర్త చనిపోయిన ఆడవాళ్లందరికీ పింఛను ప్రకటించారు.

ఇస్లాంలో వితంతు పింఛను హక్కు అలా పుట్టిందని చెబుతారు.